నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదు

ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

పరిగి, ఏప్రిల్ 9 : పరిగి మున్సిపల్ పరిధిలోని తుంకుల్‌గడ్డలో పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య పేర్కొన్నారు. తుంకులగడ్డలో పేదల ఇళ్లను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం పరిగిలోని మున్సిపల్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పరిగిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసి అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే తహసీల్దార్, కమిషనర్ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. తుంకులగడ్డలో కూటికి లేనివారు ఇళ్లు నిర్మించుకుంటుంటే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. పేదలను కలెక్టర్ పేరు చెప్పి బెదిరించడం సరైనది కాదని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణం చేపట్టిన ఇళ్లకు ఇంటినెంబర్లు, నల్లా కనెక్షన్‌లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు ఆగడాలు ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, శ్రీరాములు, శేఖర్, అశోక్, శంషోద్దీన్, వెంకటయ్య, నర్సింహులు, అశోక్, ఠాకూర్, రమేష్, శివాజీ, నర్సింహులు, రాము పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అన్యాయం

పరిగి, ఏప్రిల్ 9 : జైల్ భరో ఆందోళన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బుధవారం బహుజన్ ముక్తీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్, బీఎంపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్‌లను ముందస్తు అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం సరికాదని గట్యానాయక్ పేర్కొన్నారు.

పెన్నులు , నోటు పుస్తకాలు పంపిణీ

కులకచర్ల, ఏప్రిల్ 9 : తన కుమార్తె సహస్ర పుట్టిన రోజు సందర్భంగా కులకచర్ల కేవీఎం పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి మిషన్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



కులకచర్ల, ఏప్రిల్ 9: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాల 2001బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి శివకుమార్ అగ్నివీర్‌కు ఎంపిక కావ డంతో కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం సన్మాణించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, గ్రామస్తులు బోయిని కృష్ణయ్య, అంబదాస్, గోపాల్, బ్యాగరి శ్రీనివాస్, హన్మంతు, రాములు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నిత్య పూలమాల..



మర్పల్లి, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో బుధవారం తొమ్మిదో రోజు నిత్యపూలమాల సమర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 వరకు నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, శ్రీనివాస్, రాజు, రవి నాయక్, నగేశ్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇంట్లో అగ్నిప్రమాదం.. రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 9 : బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంలో సఫీయాబేగం ఇంట్లో కూలర్ అంటుకొని ఇల్లు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది.బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం సమయంలో ఎండవేడిమిని తట్టుకునేందుకు ఎప్పటిలాగే ఇంట్లో ఉన్న కూలర్‌ను ఆన్ చేశారు. ఆన్ చేసిన కొద్దిసేపటికి కూలర్ వైర్లు అంటుకుని మంటలు వచ్చాయని, అప్రమత్తమైన సఫీయాబేగం, కుటుంబ సభ్యులు భయంతో బయటకు వచ్చారు. కొడంగల్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందడంతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ ప్రమాదంలో డబ్బులు,బంగారం మొత్తం మంటలో కాలిపోయాయని రూ. ఆరు లక్షలకు నష్టం జరిగిందని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్, ఏప్రిల్ 9 : ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి....తాండూరు మండలం, సిరిగిరిపేట గ్రామానికి చెందిన వీరేశం(38) కొంత కాలంగా మద్యానికి బానిసైయ్యాడు. బుధవారం ఉదయం వైర్‌తో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

వికారాబాద్, ఏప్రిల్ 9 : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడాని స్థానికులు పోలీసులకు సమాచారం అందజే శారన్నారు. వ్యక్తి వయస్సు 60-65 సంవత్సరాలు ఉంటారన్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు వికారాబాద్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మర్పల్లి, ఏప్రిల్ 9: మండలంలోని కోట మర్పల్లి గ్రామానికి చెందిన బేగరి అంతయ్య మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి బుధవారం అంతయ్య అంత్యక్రియల నిమిత్తం రూ.ఐదు వేలు పంపగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి రాచయ్య, రిటైర్డ్ వీఆర్‌వో కృష్ణయ్య, బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ జైహింద్ రెడ్డి గ్రామస్తులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి నగదును అందజేశారు

అడుగంటిన నీటి వనరులు

■ ఎండిపోయిన బోర్లు, బావులు ■ మిషన్ భగీరథ నీటి సరఫరాకు బ్రేక్‌లు

అడుగంటిన బోరు నుంచి వస్తున్న సన్నని నీటిధార

మిషన్ భగీరథ నీటి ట్యాంకు

బంట్వారం, ఏప్రిల్ 9: ఈ యేడాది ఎండాకాలం మొదలవగానే గ్రామాల్లో నీటి కటకట మొదలైంది. ఎక్కడ చూసినా పుష్కలంగా ఉన్న నీళ్లు.. నేడు చుక్క బొట్టు రావడం లేదు. రిపేర్లకు నిధులు లేక అధికారులు నిరాసక్తత చూపుతుండంతో ప్రజలకు నీటి తిప్పలు తప్పడం లేదు. ఇందుకు బంట్వారం మండలంలోని మాలసోమారంలో నెలకొన్న నీటి ఎద్దడి నిదర్శనం. మండల పరిధిలోని మాలసోమారం గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంకులు రెండు ఉన్నాయి. వీటితోనే గ్రామానికి నీటిసి సరఫరా జరిగేది. అంతే కాక గ్రామంలో బోరు బావులు సైతం ఉండడం, ఒక పెద్ద బాయి నుంచి గ్రామానికి నీటిని సరఫరా చేసేవారు. అయితే వేసవి రావడంతో గ్రామంలో ఉన్న బోరు బావులు అడుగంటి పోవడంతో నీళ్లు రావడం లేదు. ఏదో కొద్ది పాటు జలదార కనిపించినట్లు 20 నిమిషాలకు ఒక బిందే నిండేలా వస్తున్నాయి. దీంతో నీళ్లు పట్టుకోవాలన్న మహిళలు బేజారైతున్నారు. ఇదే కాక గ్రామానికి నిత్య జలధారగా ఉండే బాయి సైతం నేడు ఎండిపోయింది. ఈ బావి నుంచి గ్రామా నికి నీటి సరఫరా చేసేవారు. అంతే కాక మిషన్ భగీరథ నీరు సైతం సరఫరా అయ్యేది. మూడు విధాల నీటి వనరులు ఉండి ప్రజలకు సరిపడ నీటిని అందిస్తూ వచ్చాయి. ఎండకాలం కావడంతో మూడు నీటి వనరుల నుంచి నీళ్లు అందడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పక్షం రోజులుగా నిలిచిపోయింది. గ్రామంలో ఒక బోరు కొంత నీటిని పోస్తుండ డంతో అందరు అదే బోరు నుంచి నీటిని తీసుకెళ్తున్నారు. గతంలో ఊరికి తాగు నీటిని అందించిన ఊరి చివరన ఉన్న బావి నుంచి నీటిని సరఫరా చేసే వారు. నేడు పైప్‌లైన్ లేక పోవడంతో ఆ బావి నుంచి నీటిని సరఫరా చేయలేక పోతున్నారు. గతంలో ఉన్న పైప్ లైన్ లీకేజీలు ఉండడంతో సరాఫరాను నిలిపివేశారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా లేక నిండని ట్యాంకు

కడవ నిండాలన్న కష్టమే..

కడవ నిండాలన్న కష్టంగానే ఉంది. ముందు నీళ్లు నిండుగా వస్తుండే. ఇప్పుడు ఆగి ఆగి వస్తున్నాయి. 20 రోజుల నుంచి ఇదే పరిస్థితి . ఇప్పుడే ఇలా ఉంటే...ఇంక ముందు ఎట్లుందో...

–రాసమ్మ, మాలసోమారం గ్రామం

సరిపడవస్తలేవు..

కొన్ని రోజులుగా భగీరథ నీళ్లు సరిపడ వస్తలేవు. ఉన్న బోర్లన్ని ఎండిపోయాయి. భగీరథ నీళ్లు ఉన్నాయని వాటిని పట్టించుకోలేదు. ఇప్పుడు కేవలం రెండు బోర్లు ఉన్నాయి. ఇందులో ఒకటి నీళ్లు పోయడం లేదు. ఒకటి మాత్రమే గ్రామ ప్రజలకు తాగు నీటికి వాడుకుంటున్నారు. భగీరథ నీటిని ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారు. ఏమైన మరో రెండు బోర్లు కావాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ దృష్టికి తీసుకుపోతాం. గతంలో ఆయన మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన బోర్లు ఇప్పటి వరకు నడిచాయి. ఇప్పుడు నీళ్ళు రావడం లేదు.

–నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్

నిధులు లేక ఇబ్బందులు..

గ్రామ పంచాయతీలో నిధులు లేక చాలా ఇబ్బందులు పడుతు న్నాం. ఇప్పటికే అనేక పనులకు మా స్వంత డబ్బులను ఖర్చు చేశాం. చిన్న చిన్న రిపేర్ల పనులకు పైసలు పెట్టగలుగుతాం. పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాలన్న పెట్ట లేకపోతున్నాం.

– స్రవంతి, పంచాయతీ కార్యదర్శి

లోపం ఉన్నమాట వాస్తవం

మాలసోమారం ఒక్క గ్రామనికే కాక ఇతర గ్రామాలకు సైతం మిషన్ భగీరథ నీటి సరాఫరాలో కొన్ని రొజులుగా ఇబ్బందులు ఉన్నాయి. వాటిని సరి చేసి నీటిని సరఫరా చేస్తున్నాం. అయితే గ్రామంలో ఇప్పటికే పలు చోట్ల లీకేజీలు ఉన్నాయి. బోర్లు, బావు ల్లో నీరు అడిగంటింది. వెంటనే కొత్తగా రెండు బోర్లు అవసరం ఉంది. ఇందుకు కొత్త బోరుబావులు, పంపు మోటర్లకు ప్రపోజల్స్ పంపుతాము.

–వేణుమాధవ్, ఏఈ, మిషన్ భగీరథ, బంట్వారం మండలం

పేదల అభ్యున్నతే సర్కారు లక్ష్యం



గుండాల్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

దోమ, ఏప్రిల్ 9 : దోమ మండల పరిధిలోని గుండాల్ గ్రామంలో ప్రభుత్వం ద్వారా అందించే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం పేద కుటుంబాలకు వరంలా ఉపయోగపడుతుందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఆరు కిలోల సన్నబియ్యం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తుందన్నారు. మండల పరిధిలోని దాదాపూర్, కొత్త పల్లి, గుండాల్ గ్రామంలో జైబాపు, జైభీం, జై సంవీదాన్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

ఆదర్శ స్మార్ట్ గ్రామాలుగా ఎదగాలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న టెలీకమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి నీరజ్‌మిట్టల్

మోమిన్‌పేట ఏప్రిల్ 9 : చీమలదరి గ్రామంలో విస్తరించిన బీఎస్ఎన్ఎల్ సేవలను అన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకొని ఆదర్శ స్మార్ట్ గ్రామాలుగా కావాలని భారత టెలి కమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. బుధవారం మోమిన్‌పేట మండలం చీమలదరి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలు ఏ విధంగా వినియోగించుకుంటున్నారని భారత టెలి కమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతటి మారుమూల గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకున్న గ్రామప్రజలను ఆయన అభినందించారు. ఇం దుకు తోడ్పడిన మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి ఆయన కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్ డీజీటీ ఆర్ ప్రశాంత్ పాటిల్, సీజీ ఎం టెలి కమ్యూనికేషన్ తెలంగాణ జి. రత్న కుమార్, పీజీఎం హైదరాబాద్ టెలికమ్యూనికేషన్ ఎం చంద్రశేఖర్ పీజీఎం నవీన్‌కుమార్, డీడీజీలు ఆనంద్ కుమార్, సత్యనారాయణ, డీజీఎం లు జితేందర్ సింగ్, సుదర్శన్ రావు, రమ ణ, ఏటీఎంలు కుమార స్వామి, రాంబాబు, వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, ఎంపీడీవో విజయలక్ష్మి, తహ సీల్దార్ మనోహర్ చక్రవర్తి , ఆర్ఐ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

నవాబుపేట, ఏప్రిల్ 9: సీసీ కెమెరాలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం నవాబుపేట మండల పరిధిలోని మైతాబ్‌ఖాన్ గూడలో షాపులకు సంబంధించిన వ్యక్తులకు, ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ రూపాల్లో వివిధ రకాలుగా నేరగాళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న సందర్భాలను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

భద్రేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 9: తాండూరు పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం భద్రేశ్వర దేవాలయ ప్రాంగణంలో అన్నదాన సత్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే జాతర మహో త్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేది నుంచి 23వ రకు జరిగే బ్రహ్మో త్సవాలకు నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఏర్పా ట్లకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో భదేశ్వర దేవాలయం చైర్మన్ పటేల్ కిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

కోర్టు భవనం ఏర్పాటుకు కృషి

తాండూరు కోర్టు నాయ్యవాదులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి స్థానిక కోర్టు ఆవరణంలో మౌళిక సదుపాయాలు, కోర్టు భవనం ఏర్పాటు కోసం చర్చించారు. తాండూరులో సబ్‌కోర్టు ఏర్పాటుతో పాటు నూతన భవనం, మౌళిక సౌకర్యాల కల్పనకు వెంటనే సీఎంతో మాట్లాడు తామన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గంలోని 169 మంది లబ్ధిదారులకు రూ.70.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

నేడు తైబజార్ వేలంపాట

బొంరాస్‌పేట్,ఏప్రిల్ 9 : బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే కూరగాయల సంత వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను తైబజార్ వేలంపాట ఈ నెల 10వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు నిర్ణీత సమయానికి వచ్చి 15 వందల రూపాయలను ముందస్తుగా డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాల్సిందిగా కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీమతి ఎన్.అనిత భర్త శ్రీ సత్యనారాయణ, నివాసం ధనలక్ష్మి కాలనీ, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్ టౌన్ & మహబూబ్‌నగర్ జిల్లా వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలుగాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచినందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్లయింట్ ముందుకు కొనసాగుతారు.

షెడ్యూల్ ప్రాపర్టి : గ్రామము ఎక్లాస్‌ఖాన్ పేట, మం॥ కేశంపేట, జిల్లా రంగారెడ్డిలో ట్రూ గ్రాండెలో (సన్నిధి సముద్ర హైట్స్)లో ప్లాటు నం.644, సర్వే నం.150/P, 151/P & 153/P , 183.33 చదరపు గజముల భూమి ప్లాటు కలదు.

హద్దులు : ఉత్తరము: ప్లాటు నం.645, **దక్షిణము:** ప్లాటు నం.643, **తూర్పు:** 33-00 వైడ్ రోడ్డు. **పడమర:** ప్లాటు నం.659.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 9849415189

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ గుత్తి సురేష్ తండ్రి నర్సింలు, గ్రా॥ తిమారెడ్డి, మం॥ షాబాద్, జిల్లా రంగారెడ్డి, వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి యొక్క ఆస్థిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచినందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్లయింట్ ముందుకు కొనసాగుతారు.

షెడ్యూల్ ప్రాపర్టి : గ్రా॥ తాళ్ళపల్లి H/o నాగర్‌గూడ, మం॥ షాబాద్, జిల్లా రంగారెడ్డి, తాళ్ళపల్లి గ్రామ పంచాయతీలో సర్వే నం.310 & 313/ఆ లో, 110 Sq.yard, 91.96 Sq.mtr's మరియు Plot No.24 భూమి ప్లాటు కలదు.

హద్దులు : ఉత్తరము: ప్లాటు నం.25, **దక్షిణము:** పి. నరేందర్ రెడ్డి ఫామ్ హౌస్ రోడ్డు, **తూర్పు:** 24-00 ఫీట్ల వైడ్ రోడ్డు. **పడమర:** ప్లాటు నం.23.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 9849415189

గర్భస్థ శిశువు మృతి

యాలాల, ఏప్రిల్ 9 : తాండూరు మం డ లం గౌతాపూర్‌కు చెందిన ఆశమ్మ పెళ్లియి న తొమ్మిది సంవత్సరాల తర్వాత గర్భం దాల్చింది. గత నెల 24వ తేదీన డెలివరీ డేట్ ఇవ్వగా మరికొంత ఆలస్యం అయిం ది. బుధవారం వేకువజామున పురిటి నొ ప్పులు రావడంతో ఆశమ్మను తాండూరు మాతా శిశు ఆసుపత్రికి తరలించారు. ఆశమ్మను చూసిన వైద్య సిబ్బంది స్కానింగ్ తీసుకురావాలని చెప్పడంతో ఆసుపత్రిలో ఉన్న స్కానింగ్ ఉ. 10 గంటల ముందు అందుబాటులో ఉండక పోవడంతో తాం డూరు పట్టణంలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌ను ఆశ్రయించారు. ప్రైవేటులో స్కానింగ్ రిపోర్టు చూపించగా గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు తెలుపడంతో వెం టనే మాతా శిశు ఆసుపత్రికి వచ్చి వైద్యు లకు స్కానింగ్ రిపోర్టు చూపించగా గర్భం లోనే శిశువు మృతి చెందినట్లు చెప్పడంతో భర్త లాలప్ప బోరున విలపించాడు. ఉద యమే మాతా శిశు ఆసుపత్రి వైద్యుల సకాలంలో స్పందించి ఉంటే తమకు పట్టబోయే బిడ్డకు ఎలాంటి అపాయం జరగకపోయుండేదని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే వైద్యులు తమ తప్పు ఏమీ లేదంటూ సరైన సమాధానం ఇవ్వకుండా మాట దాటవేయడం పలు అనుమానాలకు తావిస్తుం దని విమర్శలు వినిపిస్తున్నాయి.

నాణ్యత పాటించకుంటే చర్యలు

హోటల్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 9 : ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఏసుదాసు హెచ్చరించారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్‌లో ఉన్న హోటల్, బేకరీలలో మున్సి పల్ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మంచి ఆయిల్ వాడి వంటలు వండాలని, ప్రమాద కరమైన ఫుడ్ కలర్స్ వాడొద్దని, ఐఎస్ఐ ముద్ర ఉన్న వాటర్ బాటిల్స్ మాత్రమే హోటల్స్‌లో అమ్మాలని సూచించారు. ఎవ్వరు కూడా ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని, అమ్మవద్దని తెలియ జేశారు. ఈ తనిఖీల్లో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, జవాన్లు శంకర్, వినోద్ కుమార్, చెన్నయ్య, రాజు, ఆశయ్య, సిబ్బంది జనార్దన్ ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962